సాక్షి ఖమ్మం

శుక్రవారం । 8 । సెప్టెంబర్ । 2023



ఎన్నికల నేపథ్యంలో నిఘా

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో నిఘా కోసం తెలంగాణ, ఏపీ పోలీసులు ఉమ్మడి కార్యాచరణ సిద్ధం చేశారు. 10లో



మళ్లీ మోదీ ప్రభంజనమే..

వచ్చే ఎన్నికల్లోనూ మోదీ నేతృత్వాన ప్రభుత్వం ఏర్పాటవుతుందని బీజేపీ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి వెల్లడించారు. 10లో

గరిష్టం / కనిష్టం
31° / 24°

వాతావరణం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఆకాశం మేఘావృతమై చిరుజల్లుల నుంచి ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

ఖమ్మం భూమి పుత్రుడిని..



సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'ఖమ్మం నియోజకవర్గానికి నేను భూమి పుత్రుడిని.. ఇక్కడే పుట్టి పెరిగాను. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం కోసం నాకు మంత్రిగా వచ్చిన అవకాశాన్ని అద్భుతంగా వినియోగించుకున్నా. ఎలాంటి మచ్చ లేకుండా పనిచేశా. నాకు సహకరించిన సహచరులు, ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో పాటు జిల్లా ప్రజలకు రుణపడి ఉంటా. ఇక్కడి ప్రజలు నన్ను గెలిపించడంతోనే ఖమ్మంను ఇంతగా అభివృద్ధి చేయగలిగాను. 75 ఏళ్ల స్వాతంత్ర్య చరిత్రలో ఖమ్మం నియోజకవర్గానికి నాతోనే మంత్రి పదవి రాగా.. ఉపయోగించుకుని నియోజకవర్గం, ఉమ్మడి జిల్లాలో బాధ్యతలు నిర్వర్తించా'. అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. ఆయన మంత్రిగా బాధ్యతలు స్వీకరించి శుక్రవారంతో నాలుగేళ్లు పూర్తవుతున్న సందర్భంగా 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు వివరాలు వెల్లడించారు. ఆ వివరాలు మంత్రి మాటల్లోనే...

మంత్రిగా వచ్చిన అవకాశంతో అభివృద్ధి చేశా..

- రూ.3 వేల కోట్లతో నియోజకవర్గానికి హంగులు
- ప్రజల ఆశీస్సులతోనే ఇది సాధ్యమైంది
- కేసీఆర్ మూడోసారి సీఎం కావడం ఖాయం
- రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

మంచిపేరు తీసుకొచ్చా..

కేసీఆర్ లెజెండరీ సీఎం. ఆయన కేబినెట్‌లో మంత్రిగా పనిచేసే అవకాశం రావడం పూర్వజన్మ సుకృతం. దిగ్విజయంగా నాలుగేళ్లు పూర్తి చేసుకుని ఎలాంటి ఇబ్బంది లేకుండా.. సీఎం, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొచ్చేందుకు పనిచేశా. ఈ సమయంలో ఖమ్మం ప్రజల ఆకాంక్ష నెరవేరుస్తూ మున్నేరుకు ఇరువైపులా రక్షణ గోడల నిర్మాణానికి జీఓ వచ్చింది. రెండు వైపులా ఎనిమిది కి.మీ. మేర పోలేపల్లి నుంచి ప్రకాశ్‌నగర్ బ్రిడ్జి వరకు ఆర్‌సీసీ రక్షణ గోడల నిర్మాణానికి సీఎం కేసీఆర్ రూ.690.52 కోట్లు కేటాయించారు. ఐదేళ్ల క్రితం ముఖ్యమంత్రి కేసీఆర్.. నన్ను ఉద్దేశించి నా కొడుకు లాంటి వాడు.. గెలిపిస్తే ప్రజలను పువ్వుల్లో పెట్టి చూసుకుంటాడు అని అన్నారు. ఆరోజు నుంచి నేను అడిగిన దానికంటే రెట్టింపు నిధులు ఇవ్వడం ఆయనకు ఖమ్మం ప్రజలపై ఉన్న ప్రేమకు నిదర్శనం. ఒక్క మున్నేరు ప్రాజెక్టుకే రూ.900 కోట్లు ఇచ్చారు.

నలువైపులా అభివృద్ధి..

ఖమ్మంలో తాగునీరు, రహదారులు, డ్రెయినేజీల సమస్య పరిష్కరిస్తానని చెప్పా. ఇందులో 80 శాతం పూర్తి చేశా. ఇప్పుడు తీసుకున్న అంశాలు చాలా పెద్దవి. రూ.180 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీకి సంబంధించి ట్రంక్ కెనాల్ మంజూరైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఈ పనులు జరగనున్నాయి. మొదటి సారి గెలిచినప్పుడు ఓవైపే పనులు చేస్తున్నారని విమర్శించారు. కానీ ఇప్పుడు నియోజకవర్గ నలుమూలల ఎక్కడ చూసినా అభివృద్ధి కనిపిస్తుంది.

ఎంతో సంతృప్తి..

మంత్రిగా నేను ఇంటింటికీ వెళ్లి కల్యాణలక్ష్మి చెక్కులు ఇస్తుండడం ఎంతో సంతృప్తినిచ్చే అంశం. ప్రతీ అసెంబ్లీ సమావేశాల్లో ఖమ్మం ఫొటోలను కేటీఆర్ చూపిస్తూ ఇతర జిల్లాల ప్రజాప్రతినిధులను వెళ్లి చూసి రావాలని చెబుతుంటారు. మా నాన్న కూడా నేను అభివృద్ధి చేశానని మెచ్చుకున్నారు. గుట్టల బజార్‌లో 25 లక్షల లీటర్ల వాటర్ ట్యాంకు నిర్మించాం. రమణగుట్ట పైకి వెళ్లడమే కష్టమని అనుకుంటేనే అక్కడ 12 లక్షల లీటర్ల ట్యాంక్ కట్టి నీరు ఎక్కించాం. 35 వేలుగా ఉన్న నల్లా కనెక్షన్లను 70 వేలు చేశాం. 'వాడ వాడకు పువ్వాడ' కార్యక్రమంలో భాగంగా ఓ తల్లిని పలకరిస్తే గతంలో నీళ్లు తెచ్చుకోవాలంటే జాకెట్లు చినిగేవి.. ఇప్పుడు ఇంట్లోనే నీళ్లు పట్టుకుంటున్నాం అని ఆనందంగా చెబితే సంతోషం అనిపించింది.

ఇంకా చేయాల్సింది ఉంది..

సీఎం కేసీఆర్ ఇటీవల రూ.50 కోట్లు మంజూరు చేస్తే... ప్రతీ డివిజన్‌లో రెండున్నర కి.మీ. మేర డ్రెయినేజీల నిర్మాణానికి కేటాయించాం. అయినా ఖమ్మంలో మౌలిక సదుపాయాల కల్పన పూర్తయ్యేందుకు మరో రూ.2వేల కోట్ల నుంచి రూ.3 వేల కోట్లు కావాలి. మెడికల్ కళాశాల పాత కలెక్టరేట్, ఇతర భవనాల్లో ప్రారంభిస్తున్నాం. రూ.166 కోట్లతో నూతన భవనాల నిర్మాణం చేపట్టాం. ఇక ఇంజనీరింగ్ కాలేజీని పాలేరుకు ఇచ్చినా ఖమ్మంకు ఆనుకునే ఉంటుంది. మౌలిక సదుపాయాలు, విద్యా, వైద్యం అంశాల్లో ఖమ్మాన్ని ఇంకా అభివృద్ధి చేసేలా ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయి.

రూ.వేల కోట్ల నిధులు వచ్చాయి..

ఖమ్మం నియోజకవర్గానికి సీఎం అస్యూరెన్స్ ద్వారా రెండుసార్లు రూ.200 కోట్లు, ఎల్‌ఆర్ఎస్ ద్వారా రూ.100 కోట్లు, ఎస్‌డీఎఫ్ నిధులు రెండు సార్లు కలిపి రూ.80కోట్లు, సీఎం ముఖ్యమంత్రి ప్రత్యేక నిధి నుంచి మున్సిపాలిటీకి నిధులు ఇచ్చారు. అలాగే, మిషన్ భగీరథ కోసం రూ.250 కోట్లు, బస్టాండ్, కన్వెన్షన్ సెంటర్‌కుకలిపి రూ.70 కోట్లు, ఐటీ హబ్ ఫేజ్–1, ఫేజ్–2కు రూ.50 కోట్లు.. ఇలా చెప్పుకుంటూ పోతే చాలా ఉన్నాయి. మున్నేరు ప్రాజెక్టుతో కలిపి రూ.3 వేల కోట్లు ఖమ్మం నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి కేటాయించారు. ఖమ్మం నియోజకవర్గమే కాక జిల్లా అభివృద్ధికి కృషి చేస్తూనే, కరోనా, వరదల ఉమ్మడి జిల్లా వాసులకు సేవలందించే అవకాశం కల్పించిన సీఎంకు ధన్యవాదాలు.

మచ్చలేని రాజకీయాలు

అజయ్‌కుమార్ మన్ను తింటడా.. నిజాయితీగా ఉంటడా అన్నది ప్రజలకు తెలుసు. వందలు, వేల కోట్లు అని ఆరోపణలు చేస్తే పదేళ్లుగా నన్ను చూస్తున్న ప్రజలు నమ్ముతారా? ఇన్నాళ్లు మచ్చ లేని రాజకీయాలు చేయడమే కాక భవిష్యత్‌లోనూ అభివృద్ధే లక్ష్యంగా నా పయనం ఉంటుంది. ఉమ్మడి జిల్లా ప్రజలు 2014, 2018లో బీఆర్‌ఎస్‌కు ఒక్కో సీటే ఇచ్చినా ముఖ్యమంత్రి పెద్ద మనసు చేసుకుని అభివృద్ధి చేస్తున్నారు. ఈ విషయాన్ని ప్రజలు విజ్ఞతతో ఆలోచించాలి. మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమైన నేపథ్యాన జిల్లా నుంచి అత్యధిక స్థానాలను ఇస్తే తలెత్తుకుని ఉండొచ్చు.

వాళ్ల మార్కు ఏదీ?

కొందరి తీరు విచిత్రంగా అనిపిస్తుంది. తట్టెడు మట్టి ఎత్తలేదు. ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా పనిచేసిన వారి పేరిట ఒక్క అభివృద్ధి పని శిలాఫలకం ఉండదు. వారు సాధించిందేమిటో చెప్పాలి. వారికి ఎంపీ ల్యాడ్స్, సీడీపీ నిధులు ఉన్నా ఏంచేశారో తెలియదు. అభివృద్ధి జరగడం వల్లే ఖమ్మంలో ఆస్తుల విలువ పెరిగింది. మూడో విడతలో ముఖ్యమంత్రి దృష్టి భద్రాచలంపై ఉంటుంది. ఇప్పటికే యాదాద్రి ఆలయాన్ని తీర్చిదిద్దగా, వేములవాడ రాజన్న ఆలయం అభివృద్ధి జరుగుతోంది. అనంతరం భద్రాద్రి ఆలయాన్ని ఇదే తరహాలో అభివృద్ధి చేస్తారు.

అన్ని ఎన్నికలు గెలిపించా..

బీఆర్‌ఎస్‌లో సుశిక్షితుడినైన కార్యకర్తగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఏ బాధ్యత ఇచ్చినా నిర్వర్తించా. అసెంబ్లీ ఎన్నికల్లో నేనొక్కడినే గెలిచా. ఆతర్వాత ఎంపీ ఎన్నికల్లో అందరం కలిసి గెలిపించాం. అనంతరం జెడ్పీ, మున్సిపల్, డీసీసీబీ, కార్పొరేషన్ ఎన్నికలతో పాటు ఎమ్మెల్సీలుగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి, తాతా మధును గెలిపించుకున్నాం. గతంలో హత్యా రాజకీయాలు ఉండగా, వ్యక్తిత్వ హననం వరకు దిగజారారు. నేను మాత్రం గ్రూపు రాజకీయాలు, వర్గ రాజకీయాలకు దూరం. సీఎంతో పాటు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చే ఆదేశాలకు అనుగుణంగా నా బాధ్యతలు నిర్వర్తిస్తున్నా.

'ఆమె'కు అభయం!

- 'ఆరోగ్య మహిళ'లో పరీక్షలు, చికిత్స
- జిల్లాలోని ఆరు సెంటర్లలో పరీక్షలు, ఆపై జిల్లా ఆస్పత్రికి...
- అవసరమైన వారిని హైదరాబాద్‌కు రిఫర్
- జిల్లాలో ఇంకో ఏడు సెంటర్లకు అనుమతి



జిల్లా ఆస్పత్రిలో పరీక్షల కోసం వచ్చిన మహిళలు

ఖమ్మం వైద్యవిభాగం: 'ఆరోగ్య మహిళ' కార్యక్రమం ద్వారా మహిళలకు ప్రత్యేక వైద్యం అందిస్తున్నారు. మహిళలు ఎదుర్కొంటున్న పలు రకాల వ్యాధులను రూపుమాపేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ ఏడాది మార్చి 8న అందుబాటులోకి తీసుకురాగా, జిల్లాలో తొలి విడతగా ఆరు పీహెచ్‌సీలకు అనుమతి ఇచ్చారు. అక్కడ నిత్యం మహిళలకు ప్రత్యేక వైద్యం అందిస్తూ, సమస్య తీవ్రత ఉన్న వారిని జిల్లా ఆస్పత్రిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్)కు రిఫర్ చేస్తున్నారు. ఈమేరకు ఎంసీహెచ్‌లో ప్రతీ మంగళవారం వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఒకవేళ ఇక్కడ కూడా వైద్యం అందుబాటులో లేకపోతే హైదరాబాద్ పంపిస్తున్నారు.

రెండు వేలు దాటిన రిఫరల్ కేసులు

పెద్దాస్పత్రిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి ఆరు సెంటర్ల ద్వారా రిఫర్ చేసిన మహిళలను ప్రతీ మంగళవారం వైద్యులు పరీక్షిస్తారు. ఆరోగ్య మహిళ కార్యక్రమం ప్రారంభమైన ఆరు నెలల్లో 2,010 మంది మహిళలను పెద్దాస్పత్రికి రిఫర్ చేశారు. వీరిలో ఇప్పటి వరకు 1,859 మందికి వైద్య సేవలు అందించగా మరో 151 మందికి చికిత్స చేయాల్సి ఉంది. ఈకార్యక్రమం ద్వారా థైరాయిడ్, ఓరల్, బ్రెస్ట్, సర్వైకల్ కేన్సర్, పోషకాహార లోపం, రక్తహీనత, మూత్రకోశం, నెలసరి వంటి సమస్యలకు చికిత్స అందుతోంది. ప్రస్తుతం మహిళల్లో ఆందోళన కలిగిస్తున్న కేన్సర్‌ను తొలి దశలోనే నియంత్రించేందుకు కృషి చేస్తున్నారు. పెద్దాస్పత్రిలో రిఫరల్ కేసులతో పాటు సాధారణంగా వచ్చే మహిళలకు కూడా మంగళవారం ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని వర్తింపజేస్తున్నారు. ఇలా 2,970 మంది మహిళలు వైద్యసేవలు పొందారు. ఇక 30 కేన్సర్ కేసులను హైదరాబాద్ ఎస్‌ఎంజేకి రిఫర్ చేశారు.

మరో ఏడు సెంటర్లకు అనుమతి

ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని తొలి విడతగా జిల్లాలోని ఆరు కేంద్రాల్లో మాత్రమే ప్రారంభించారు. ఎం.వెంకటాయపాలెం, మంచుకొండ, కామేపల్లి, వైరా, చెన్నూరు, బోనకల్ పీహెచ్‌సీల్లో మహిళలకు చికిత్స చేస్తూ మందులు అందజేస్తున్నారు. ఈ కేంద్రాల్లో ప్రతిరోజు వైద్యసేవలందిస్తూ అనారోగ్య సమస్యలు ఉన్న మహిళలను పరీక్షల కోసం ఖమ్మం ఆస్పత్రికి రిఫర్ చేస్తుంటారు. ఆయా పీహెచ్‌సీల నుండి వచ్చిన వారిని ప్రతీ మంగళవారం స్కానింగ్, వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి వ్యాధి తీవ్రత ఆధారంగా చికిత్స ఆరంభిస్తారు. వీరిలో అత్యవసరమైన వారిని హైదరాబాద్ పంపిస్తారు. కాగా, ప్రైవేట్‌లో ఖర్చుతో కూడుకున్న వైద్యం ఉచితంగా లభిస్తుండటంతో ఎక్కువ మంది మహిళలు ఆయా సెంటర్లకు వస్తున్నారు. తాజాగా ప్రభుత్వం జిల్లాలోని లంకాసాగర్, ముదిగొండ, నేలకొండపల్లి, సుబ్లేడ్, వేంసూర్ పీహెచ్‌సీలతో పాటు ఖమ్మం పాత మున్సిపాలిటీ, తపాలగూడెం(మేదరిబస్తీ) సెంటర్లకు సైతం అనుమతి ఇచ్చింది. త్వరలోనే ఈకేంద్రాల్లో ఆరోగ్య మహిళ కార్యక్రమం ప్రారంభం కానుంది.

మాది పెత్తందారీ వ్యతిరేక పోరాటమే..

ఖమ్మంమయూరిసెంటర్: కమ్యూనిస్టులు ముస్లింలకు వ్యతిరేకంగా సాయుధ పోరాటాన్ని నిర్వహించలేదని.. కేవలం పెత్తందారులు, దొరతనం, బానిసత్వానికి వ్యతిరేకంగానే పోరాడారని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు వెల్లడించారు. కమ్యూనిస్టుల పోరాట ఫలితంగానే నిజాం రాజ్యం దేశంలో విలీనమైందని, కమ్యూనిస్టుల పోరాటం లేకుండా తెలంగాణ ఊసే లేదని స్పష్టం చేశారు. సాయుధ పోరాటయోధుడు రావి నారాయణరెడ్డి వర్ధంతి సందర్భంగా ఖమ్మంలోని సీపీఐ కార్యాలయంలో గురువారం ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించాక భాగం మాట్లాడారు. సాయుధ పోరాటాన్ని గుర్తించి అధికారికంగా నిర్వహిస్తామని చెప్పిన కేసీఆర్ పదేళ్లకాలంలో ఆ ఊసెత్తలేదన్నారు. ఈనెల 11 నుంచి 16వ తేదీ వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎస్.కే.జానీమియా, కొండపర్తి గోవిందరావు, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, సీహెచ్.సీతామహాలక్ష్మి, రావి శివరామకృష్ణ, తోట రామాంజనేయులు, మేకల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులకు వరద

పాల్వంచరూరల్/చర్ల : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో భద్రాద్రి జిల్లాలోని కిన్నెరసాని, తాలిపేరు ప్రాజెక్టుల్లోకి వరద వచ్చి చేరుతోంది. 407 అడుగుల నీటినిల్వ సామర్థ్యం గల కిన్నెరసాని రిజర్వాయర్‌లోకి గురువారం ఎగువనుంచి 5వేల క్యూసెక్కుల నీరు రావడంతో నీటిమట్టం 405 అడుగులకు చేరింది. దీంతో ఒక గేటు ఎత్తి 5వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. ఇక తాలిపేరు ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు రావడంతో ఆరు గేట్లు ఎత్తి 4,123 క్యూసెక్కుల చొప్పున నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 74 మీటర్లు కాగా, ప్రస్తుతం 73.30 మీటర్లుగా నీటిమట్టం కొనసాగిస్తున్నారు.

కృష్ణ కృష్ణ.. హరేహరే !



జిల్లా వ్యాప్తంగా ప్రజలు శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా ఆలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించగా.. పలు ప్రాంతాల్లో సాయంత్రం జరిగిన ఉట్టి కొట్టే వేడుకల్లో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. ఖమ్మంలోని శ్రీ మురళీకృష్ణ మందిరంలో ఉత్సవ విగ్రహాలకు అభిషేకం చేయడంతో పాటు ఇతర పూజలు నిర్వహించగా వేలాదిగా భక్తులు పాల్గొన్నారు.

ముందస్తు లోక్ అదాలత్

ఖమ్మంలీగల్: జాతీయ లోక్ అదాలత్ శనివారం జరగనుండగా, ముందస్తుగానే సాధ్యమైనంత మేర కేసులు పరిష్కరించడంలో న్యాయమూర్తులు నిమగ్నమయ్యారు. ఈమేరకు గురువారం సెలవు దినమైనప్పటికీ మూడో అదనపు మెజిస్ట్రేట్ వి.మాధవి తన కోర్టులో లోక్ అదాలత్ నిర్వహించారు. రెండో అదనపు మెజిస్ట్రేట్ కోర్టుకు పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆమె ఖానాపురం హవేలీ పోలీసు స్టేషన్ పరిధిలోని కేసును పరిష్కరించారు. కొట్లాట కేసులో ఇరుపక్షాల వారు సమీప బంధువులే కావడంతో మాట్లాడి రాజీ కుదిర్చారు. కోర్టు సూపరింటెండెంట్ లిటిల్, పోలీసు సిబ్బంది పాల్గొనగా న్యాయసేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అబ్దుల్ జావీద్‌పాషా పర్యవేక్షించారు.



కేసు వివరాలు పరిశీలిస్తున్న న్యాయమూర్తి మాధవి

హైటెక్ దొంగల గుట్టురట్టు

- సాంకేతిక లోపాల సాయంతో నగదు స్వాహా
- యూపీ, హరియాణాకు చెందిన ముగ్గురి అరెస్ట్

ఖమ్మంక్రైం: ఖమ్మం జిల్లాలోని పలు బ్యాంకుల ఏటీఎంల నుంచి నగదు స్వాహా చేస్తున్న యూపీ, హరియాణా రాష్ట్రాలకు చెందిన ముగ్గురు ముఠా సభ్యులను ఖమ్మం వన్‌టౌన్, సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈసందర్భంగా వన్ టౌన్ సీఐ స్వామి గురువారం వెల్లడించారు. హరియాణా తహశీల్‌మేవు జిల్లాకు చెందిన వారిస్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని హమీర్‌పూర్ తహసీల్‌కు చెందిన నిషాద్ రాధేశ్యాం, నిషాద్ సంజయ్ ముఠాగా ఏర్పడ్డారు. వీరి తమ ప్రాంతంలోని వ్యక్తుల పేర్లతో బ్యాంకు ఖాతాలను తెరుస్తారు. అనంతరం ఆయా ఖాతాల్లో నగదు జమ చేసి, వారి నుంచి ఏటీఎం కార్డులు తీసుకుంటారు. ఆతర్వాత ఇతర రాష్ట్రాలకు బయలుదేరుతారు.

ఇలా చోరీలకు పాల్పడుతారు...

ఈ ముఠా సభ్యులు దూర రాష్ట్రాలకు వెళ్లి నిర్మానుష్య ప్రాంతాల్లో, సెక్యూరిటీ గార్డులు లేని ఏటీఎంలను ఎంచుకుంటారు. ఏటీఎం ద్వారా డబ్బు డ్రా చేసే క్రమాన నగదు సగం బయటకు రాగానే ఆపడం, ఆ నగదు తీసుకున్నాక ఖాతాల్లో డబ్బు తగ్గినా మెసేజ్ మాత్రం 'ట్రాన్సాక్షన్ ఫెయిల్'గా ఎలా వస్తుందో వీరికి అవగాహన ఉంది. దీంతో ఈ మార్గాన్ని ఎంచుకుని డబ్బు తీసుకుని మళ్లీ కస్టమర్ కేర్‌కు ఫిర్యాదు చేస్తారు. ఫలితంగా కొన్నాళ్లకు మళ్లీ ఖాతాలో నగదు జమ అవుతోంది. ఇలా వచ్చిన సొమ్మును వీరు ముగ్గురు వాటాలుగా పంచుకుంటారు. గత రెండు నెలల్లో ఖమ్మం జిల్లాలోని పలు ఏటీఎంల్లో ఇదే తరహా జరిగిన నేపథ్యాన పోలీసులు నిఘా వేశారు. ఖమ్మం స్టేషన్‌రోడ్డులో ఉన్న స్తంభాద్రి బ్యాంక్ వద్ద ఏటీఎంకు గురువారం వచ్చిన ముగ్గురు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని విచారించగా వ్యవహారం బయటపడింది. వీరి నుంచి 34 ఏటీఎం కార్డులు, రూ.15వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.





నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఖమ్మం వన్ టౌన్ సీఐ స్వామి (ఇన్‌సెట్) స్వాధీనం చేసుకున్న ఏటీఎం కార్డులు, నగదు

న్యూస్‌రీల్

మంత్రి కేటీఆర్‌ను కలిసిన పువ్వాడ, మదన్‌లాల్



కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న మదన్‌లాల్, పక్కన మంత్రి పువ్వాడ

ఖమ్మం మయూరిసెంటర్/ వైరా: విదేశీ పర్యటన ముగించుకుని హైదరాబాద్ చేరుకున్న రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కె.తారక రామారావు(కేటీఆర్)ను రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట వైరా బీఆర్‌ఎస్ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ కూడా కేటీఆర్‌ను కలిసి తనకు టికెట్ కేటాయించడంపై కృతజ్ఞతలు తెలిపారు.

పార్లమెంటరీ కామర్స్ కమిటీ సభ్యుడిగా 'నామ'



నామ నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: వాణిజ్య శాఖకు సంబంధించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా బీఆర్‌ఎస్ లోక్ సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనను సభ్యుడిగా నామినేట్ చేస్తున్నట్లుగా రాజ్యసభ సెక్రటేరియట్ నుంచి గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా, నాగేశ్వరరావును పార్లమెంటరీ కామర్స్ కమిటీ సభ్యుడిగా నియమించడంపై ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈనెల 13న సైన్స్ సెమినార్

ఖమ్మంసహకారనగర్: బెంగళూరుకు చెందిన శ్రీ విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నాలజికల్ మ్యూజియం ఆధ్వర్యాన ఈనెల 13న జిల్లాస్థాయి సైన్స్ సెమినార్ నిర్వహిస్తున్నట్లు డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. జిల్లా కేంద్రంలోని నయాబజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'మిల్లెట్స్ – ఏ సూపర్ ఫుడ్ అండ్ డైట్ ఫ్యాడ్' అంశంపై ఈ సెమినార్ జరుగుతుందని పేర్కొన్నారు. ఈమేరకు 8 నుంచి 10వ తరగతి చదువుతూ మండల స్థాయి పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులు హాజరు కావాలని సూచించారు.

'ప్రయాస్'కు దరఖాస్తులు

విద్యార్థుల్లో పరిశోధనాత్మకతను ప్రోత్సహించేందుకు ఎన్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యాన 'ప్రయాస్' పేరిట పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. ప్రతీ పాఠశాల, కళాశాల నుంచి ఒకరికే అవకాశం ఉండగా, 9, 10, ఇంటర్ విద్యార్థులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 20 లోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ తెలిపారు.

డీసీహెచ్‌ఎస్‌గా రాజశేఖర్ నియామకం నిలుపుదల

ఖమ్మంలీగల్: జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి(డీసీహెచ్‌ఎస్)గా డాక్టర్ కె.రాజశేఖర్ గౌడ్ నియామకాన్ని నిలిపేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన నియామకాన్ని సవాల్ చేస్తూ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను ఈనెల 6న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.మాధవీదేవి విచారించారు. సీనియారిటీ ప్రాతిపదికన ఒకటో స్థానంలో ఉండి డీసీహెచ్‌ఎస్‌గా కొనసాగుతున్న బి.వెంకటేశ్వర్లు స్థానంలో జూనియర్ అయిన రాజశేఖర్‌ను నియమించడం చట్ట వ్యతిరేకమని పేర్కొన్నారు. ఈమేరకు నియామకాన్ని మూడు వారాలపాటు నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.

పాలేరు నుంచి రెండో జోన్‌కు సాగునీరు

కల్లూరు: నాగార్జునసాగర్ ఎడమ కాల్వ పరిధి రెండో జోన్‌లో ఖరీఫ్ పంటల సాగు కోసం నీరు విడుదల చేశారు. ఈ ప్రాంతంలో రైతులు వరి సాగు చేయగా, వర్షాలు లేక పంట ఎండిపోతోంది. ఇదే సమయాన పాలేరు ఎగువ భాగాన కురుస్తున్న వర్షాలతో రిజర్వాయర్‌లోకి వరద చేరి అలుగు పడింది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ముఖ్యమంత్రి కేసీఆర్‌తో మాట్లాడి అలుగు ద్వారా వృథాగా పోయే నీటిని ఐదు రోజుల పాటు విడుదల చేయాలని కోరగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో గురువారం 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా శుక్రవారం కల్లూరు మండలానికి చేరుకునే అవకాశముంది. ఈ నీరు చేరితే ఎండుతున్న వరి పంటకు ప్రాణం వచ్చినట్లవుతుంది. కాగా, రైతులు నీటిని పొదుపుగా వాడుకుంటూ పంటలు సాగు చేసుకోవాలని జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్ కోరారు.

క్లుప్తంగా

పాలాభిషేకం

ఖమ్మంసహకారనగర్: డాక్టర్స్ మెడికల్ అకాడమి విద్యార్థులు గురువారం ఆర్థిక, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. నీట్ కౌన్సెలింగ్ ఈనెల 7న పూర్తి కావాల్సి ఉండగా.. తల్లిదండ్రుల అభ్యర్థన మేరకు 8కి వాయిదా వేయగా.. ఆల్ ఇండియా కోటాకు వెళ్లే విద్యార్థులకు కేఎన్ఆర్‌యూహెచ్ నుంచి సర్టిఫికెట్లు తీసుకెళ్లే అవకాశం ఉండడంతో పాలాభిషేకం చేశారు. ఖమ్మం డాక్టర్స్ మెడికల్ అకాడమి యాజమాన్యం రాయల సతీష్, ఈగా భరణికుమార్ పాల్గొన్నారు.

శంకుస్థాపన

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 50వ డివిజన్‌లో పీవీ నరసింహారావు పార్కులో రూ.1.65 లక్షలతో నిర్మించనున్న యోగా షెడ్ నిర్మాణ పనులకు మేయర్ నీరజ శంకుస్థాపన చేశారు. అలాగే 35వ డివిజన్‌లో రాఘవపురంలో నూతనంగా నిర్మించనున్న కల్వర్టు నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్పొరేటర్లు రాపర్తి శరత్‌కుమార్, యల్లంపల్లి వెంకట్రావు, నాయకులు బోజడ్ల రామ్మోహన్‌రావు, మాటేటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్లకు వినతి

తిరుమలాయపాలెం/ఖమ్మంరూరల్: గృహలక్ష్మి పథకానికి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు ఇవ్వాలని కోరుతూ.. సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు గురువారం మండలాల తహసీల్దార్లు పి.రామ్‌ప్రసాద్‌కు, బీ.బీ.రామకృష్ణలకు వినతి పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐకేపీఎస్ జిల్లా అధ్యక్షుడు మలీదు నాగేశ్వరరావు, పార్టీ జిల్లా నాయకుడు బందెల వెంకయ్య, ఆర్.శివలింగం, వెంకన్న, శంకర్, పులుగుజ్జు వెంకటస్వామి, సోమనపల్లి వెంకటేశ్వర్లు, రామారావు, నర్సయ్య, మారుతి మల్లయ్య, ఎం.బాబు పాల్గొన్నారు.

వ్యాఖ్యలు గర్హనీయం

ఖమ్మంమామిళ్లగూడెం: తమిళనాడు యువజన క్రీడల శాఖ మంత్రి ఉదయనిధి స్టాలిన్ తల తీసేస్తే రూ.10 లక్షలు ఇస్తానని ప్రకటించిన పరమహంస ఆచార్య వ్యాఖ్యలు మనువాదానికి పరాకాష్ట అని అతనిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని బీఆర్ అంబేడ్కర్ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు లింగాల రవికుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖమ్మంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గంగాధర్ వేణు, భిక్షం, ఆనంద్, భాగ్యరాజ్ తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

ఖమ్మం మామిళ్లగూడెం: తమపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కవిరాజ్‌నగర్‌కు చెందిన పేరసాని సత్యనారాయణ ఆయన కుటుంబసభ్యులు కోరారు. గురువారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2016లో వ్యాపార నిమిత్తం రూ.8.5 లక్షలను రూ.3 వడ్డీ చొప్పున కవిరాజ్‌నగర్‌కు చెందిన కర్నాటి సీతారాములు వద్ద అప్పు తీసుకుని వడ్డీ చెల్లిస్తున్నా ఈనెల 5న కార్పొరేటర్ భర్త ఎం.నరేంద్ర ప్రోద్బలంతో తమపై దాడి చేసి బలవంతంగా కామేపల్లిలోని తమ భూమిని కల్తీ బుచ్చయ్యకు రూ.40లక్షలకు అమ్మినట్లు బాండ్ పేపర్‌పై సంతకాలు చేయించుకున్నారని ఆరోపించారు. ఈ విలేకరుల సమావేశంలో భార్య నాగమణి, కొడుకు కిషోర్, కూతురు ప్రియాంక పాల్గొన్నారు.

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు

మండలాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను గురువారం భక్తిశ్రద్ధలతో భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే తలంటు స్నానం చేసి ఆలయాలు, ఇళ్లల్లో ప్రత్యేక గోపూజ, పంచామృతాభిషేకం పూజలు చేశారు. ఈనేపథ్యాన రుక్మిణి సమేత రాధాకృష్ణుల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులను చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలో అలంకరించగా.. పలు ప్రాంతాల్లో ఉట్టి కొట్టడం, అన్నదానం వంటి కార్యక్రమాలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్


కామేపల్లిలో రాధాకృష్ణుల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు


కూసుమంచి: పాలేరులో స్తంభానికి ఉంచిన అరిసెలు తీసుకుంటున్న యువకులు


కృష్ణుడిని దర్శించుకున్న మహిళలు


ఖమ్మం సహకారనగర్: శ్రీరామకృష్ణ విద్యాలయంలో..




ఖమ్మంగాంధీచౌక్: శ్రీ రంగనాథ స్వామి ఆలయంలో గోవును పూజిస్తున్న భక్తులు





శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు


ఖమ్మంఅర్బన్: 14వ డివిజన్ మధురానగర్‌లోని సాయిబాబా మందిరంలో..

గడపగడపకు కాంగ్రెస్ ..


కరపత్రాలు పంచుతున్న విజయ్‌బాబు, తదితరులు

ఖమ్మంఅర్బన్/కామేపల్లి(కారేపల్లి): బీఆర్ఎస్ హయాంలో గత తొమ్మిదిన్న ఏళ్లలో రాష్ట్రాభివృద్ధి శూన్యమని జిల్లా కాంగ్రెస్ నాయకులు, డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు తెలిపారు. గురువారం నగరంలోని మూడో డివిజన్‌లో గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు కరపత్రాలు పంచుతూ ఓటర్లతో మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆశీర్వాదించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమాల్లో డివిజన్ కార్పొరేటర్ మలీదు జగన్, నాయకులు మందడపు తిరుమలరావు, బోడా శ్రావణ్ కుమార్, చంద్రం, కాంపాటి వెంకన్న, నరాల నరేష్, మాలోత్ రాము, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తత అవసరం

రఘునాథపాలెం: మండలంలోని మల్లేపల్లిఓ సైబర్ నేరాలపై స్థానిక ఎస్ఐ కొండలరావు ఆధ్వర్యాన గురువారం ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది స్థానికులకు అవగాహన కల్పించారు. ఏదైనా మోసానికి గురైనట్లు తేలితే వెంటనే 1930 నంబర్‌కు డయల్ చేయాలని సూచించారు.

ఆలయ నిర్మాణానికి విరాళాలు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 4వ డివిజన్ కైకొండాయిగూడెం క్రాస్‌రోడ్డులోని శ్రీ అంకమ్మ, శ్రీ మహాలక్ష్మమ్మ, శ్రీ మద్దిరావమ్మ అమ్మవార్ల దేవాలయ నిర్మాణానికి పలువురు దాతలు గురువారం విరాళాలు అందించినట్లు దేవాలయ కమిటీ అధ్యక్షుడు కొమ్ము భాస్కర్ తెలిపారు. కైకొండాయిగూడెంకు చెందిన లింగనబోయిన శ్రీనివాసరావు–చంద్రకళ దంపతులు, మురళీ–మాధవి దంపతులు, పాలంకి విజయ్‌కుమార్‌రెడ్డి–నళిని దంపతులు ఒక్కొక్కరు రూ.10,116 చొప్పున విరాళంగా అందించారని పేర్కొన్నారు.

మండలాల్లో ఎమ్మెల్యే పర్యటన

నేలకొండపల్లి/ఖమ్మంరూరల్: నేలకొండపల్లి మండలం కట్టుకొమ్ముతండాలో మేరమ్మ తల్లి, బొడ్రాయి భూమి పూజలో ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఖమ్మంరూరల్ మండలంలోని కాచిరాజుగూడెం పంచాయతీ కార్యాలయాన్ని, దానవాయిగూడెంలో రేషన్ దుకాణాన్ని ప్రారంభించారు. తీర్థాలలో సీసీరోడ్డుకు శంకుస్థాపన చేశారు. కాచిరాజుగూడెం, రామన్నపేటలో బీఆర్ఎస్‌లో పార్టీలోకి పలువురిని కండువాలు కప్పి ఆహ్వానించారు. మున్నేరు కరకట్ట నిర్మాణ ప్రదేశాన్ని ఇరిగేషన్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఎంపీపీలు వజ్జా రమ్య, బెల్లం ఉమ, జెడ్పీటీసీ ఎ.వరప్రసాద్‌తో పాటు బెల్లం వేణు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్లు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ, బొడ్రాయి ప్రతిష్ఠ

రఘునాథపాలెం: మండలంలోని మల్లేపల్లిలో గురువారం వేలాది మంది భక్తజనం సమక్షంలో ముత్యాలమ్మ, బొడ్రాయి ప్రతిష్ఠా వేడుకలు అర్చక బృందం మంత్రోచ్ఛరణ నడుమ ఘనంగా నిర్వహించారు. భక్తులు ముత్యాలమ్మకు బోనాలను సమర్పించాక.. భక్తులకు అన్నదానం చేశారు.


పూజలో పాల్గొన్న భక్తులు

అంకమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

కూసుమంచి: మండలంలోని జక్కేపల్లి గ్రామంలో గ్రామానికి చెందిన తిప్పని వెంకటరెడ్డి, కళావతితో పాటు వారి కుమారులు శ్రీనివాసరెడ్డి, అశోక్‌రెడ్డి సొంత ఖర్చులతో నిర్మించనున్న గురువారం అంకమ్మ తల్లి నూతన ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ వేడుకలో సర్పంచ్ నలబోలు మాధవీ, ఎంపీటీసీ కందల వెంకటనారాయణ, సొసైటీ చైర్మన్ నలబోలు చంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోం..

ఖమ్మంమయూరిసెంటర్: రూ.వేల కోట్లు ఖర్చు చేసి ఖమ్మం నగరాన్ని అభివృద్ధి చేసి, సంక్షేమ పథకాలు నేరుగా ప్రజలకే అందేలా చేస్తున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌పై అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్‌లు అన్నారు. గురువారం ఖమ్మంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశంలో మైనార్టీ జిల్లా అధ్యక్షుడు తాజుద్దీన్, నాయకులు ఆకుల మూర్తి, మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళి, షేక్ షకీన, తోగరు భాస్కర్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన

ఖమ్మంసహకారనగర్: విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్షా సంఘం ఆధ్వర్యాన రోడ్డు ఊడుస్తూ గురువారం నిరసన వ్యక్తం చేశారు. సమగ్ర జేఏసీ సంఘం నాయకుడు మహబూబ్ పాషా, వీరస్వామి ఆధ్వర్యాన నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు 4వ రోజుకు చేరుకున్నాయి. సమగ్ర శిక్ష జేఏసీ నాయకులు భగవాన్, నాగరాజు, రుద్రగిరి, సైదమ్మ, విజయ్, మోతీలాల్, మధు, నాగరాజు, తిరుపయ్య, డీపీఓ స్టాఫ్, సీఆర్‌పీలు, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

నేలకొండపల్లి: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మండలంలోని చెరువుమాధారానికి చెందిన రాతికింది సాయికిరణ్(20), సాయిపవన్ బుధవారం రాత్రి బైక్ వస్తుండగా ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన వీరిని ఖమ్మం ఆస్పత్రిలో చేర్పించగా సాయికిరణ్ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. హార్వెస్టర్, జేసీబీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న ఆయన మృతిపై కుటుంబీకులు చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

తిరుమలాయపాలెం: మద్యానికి బానిసై అనారోగ్యపాలై ఓ వ్యక్తి గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని హైదర్‌సాయిపేట గ్రామానికి చెందిన భూక్యా నరేష్(29) మద్యానికి బానిసై అనారోగ్యంతో పాటు అప్పులపాలయ్యాడు. దీంతో జీవితంపై విరక్తితో బుధవారం ఉదయం గడ్డిమందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించగా గురువారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సినిమా ఫక్కీలో ఫోన్ చోరీ

నేలకొండపల్లి: మండల కేంద్రంలో పట్టపగలు సినీ ఫక్కీలో కొంతమంది యువకులు చోరీకి పాల్పడ్డారు. మండల కేంద్రంలో ఫ్యాన్సీ దుకాణం నిర్వహిస్తున్న వేముల సురేష్ వద్దకు గురువారం బైక్‌పై ఓ యువకుడు వచ్చాడు. బైక్ దిగే క్రమంలో బైక్ పడిపోతున్నట్లు నమ్మించగా, సదరు వ్యాపారి వెంటనే బైక్‌ను పట్టుకునే ప్రయత్నం చేశాడు. అప్పటికే అక్కడ ఉన్న ఇంకో యువకుడు బైక్‌పై కూర్చోగా, ఇద్దరు కలిసి సురేష్ జేబులోని సెల్ లాక్కుని వెళ్లిపోయారు. ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు


నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు


కూసుమంచి: నివాళులర్పిస్తున్న రాయల

ఖమ్మంసహకారనగర్/నేలకొండపల్లి/తిరుమలాయపాలెం/కూసుమంచి/కామేపల్లి(కారేపల్లి): ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భారత్ జోడో యాత్ర విజయవంతమై ఏడాది పూర్తయిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. గురువారం ఈమేరకు ఖమ్మం నగరంలోని మయూరి సెంటర్ నుంచి జెడ్పీ అంబేడ్కర్ విగ్రహం వరకు నగర కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యాన పాదయాత్ర చేపట్టారు. అలాగే, నేలకొండపల్లి, కూసుమంచిలో టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు కేక్‌ను కట్ చేసి రాజీవ్‌గాంధీ, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తిరుమలాయపాలెంలో పార్టీ మండల అధ్యక్షుడు, జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్ కేక్ కట్ చేశారు. భారత్ జోడో యాత్రకు సంఘీభావంగా కామేపల్లి మండల పరిధిలోని ముద్దులపల్లి గ్రామంలో మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, నాయకుడు మువ్వా విజయ్‌బాబు, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు జావీద్, రాయల నాగేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో అధ్యక్షులు, నాయకులు, ఇన్‌చార్జ్‌లు పుచ్చకాయల వీరభద్రం, కొత్తా సీతారాములు, యడ్లపల్లి సంతోష్, బేబీ స్వర్ణకుమారి, రామిరెడ్డి చరణ్ రెడ్డి, అమర్జహాన్ బేగం, దొబ్బల సౌజన్య, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, చోటా బాబా, మొక్కా శేఖర్ గౌడ్, బొడ్డు బొందయ్య, జెర్రిపోతుల అంజిని, రేగూరి హనుమంతరావు, యడవల్లి నాగరాజు, రామసహాయం అరవిందరెడ్డి, భూక్యా వీరన్న, షేక్ గోరేమియా, రెడబోతు గోపిరెడ్డి దోమలపాటి సత్యనారాయణ, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

టీజేఎస్ నగర కమిటీ ఎన్నిక

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ జన సమితి ఖమ్మం నగర కమిటీని గురువారం ఖమ్మంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యదర్శి గోపగాని శంకర్‌రావు, జిల్లా కన్వీనర్ వర్దబోయిన బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడిగా జంగిపల్లి రవి, ఉపాధ్యక్షుడు శ్రీనివాసచారి, ప్రధాన కార్యదర్శులుగా లోడంగి సత్యనారాయణ, ఆంజనేయులు, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా నాగేందర్‌రావు, మల్లికార్జునరావు, కోశాధికారిగా నూనె భాస్కర్‌రావు, అధికార ప్రతినిధులుగా రాంబాబు, డేవిడ్‌లను ఎన్నుకున్నారు. అలాగే రఘునాథపాలెం మండల కన్వీనర్‌గా రాగం పాపారావును ఎన్నుకున్నారు.

క్లుప్తంగా...



మార్గదర్శి దందాపై విచారించాలి

హైకోర్టుకు నివేదించిన సీఐడీ.. అప్పీళ్లు దాఖలు

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ ఆర్థిక అవకతవకలు, తప్పుడు రికార్డుల నిర్వహణ, నిధుల మళ్లింపు, ఇతర చట్ట ఉల్లంఘనలపై రామోజీ, శైలజా కిరణ్ తదితరులపై నమోదు చేసిన కేసులో తాము దాఖలు చేసిన చార్జిషీట్‌లను గుంటూరు, విశాఖపట్నంలోని డిపాజిటర్ల పరిరక్షణ చట్టం ప్రత్యేక కోర్టులు 'రిటర్న్' చేస్తూ గత నెల 28న జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ ఏపీ సీఐడీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ ఉత్తర్వులను రద్దు చేయడంతో పాటు, కేసును విచారణకు స్వీకరించేలా ఆ కోర్టులను ఆదేశించాలని కోరుతూ సీఐడీ అదనపు ఎస్పీ ఈ అప్పీళ్లను దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాల్లో మార్గదర్శి చైర్మన్ చెరుకూరు రామోజీరావు, ఎండీ శైలజా కిరణ్, ఆడిటర్ కుదరవల్లి శ్రవణ్‌లతో పాటు వైస్ ప్రెసిడెంట్లు, డైరెక్టర్లు, జనరల్ మేనేజర్లు, బ్రాంచ్ మేనేజర్లు ఇలా మొత్తం 15 మందిని ప్రతివాదులుగా పేర్కొన్నారు. ఈ అప్పీళ్లపై హైకోర్టు వచ్చే వారం విచారణ జరిపే అవకాశం ఉంది.

ప్రజలందరికీ.. 'ఆరోగ్య సురక్ష'

సాక్షి, అమరావతి/చిలకలూరిపేట: ఏపీ ప్రజలందరి ఆరోగ్య రక్షణ లక్ష్యంగా వైఎస్ జగన్ ప్రభుత్వం మరో విప్లవాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలందించేందుకు 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని చేపట్టింది. ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించడం, ప్రాథమిక పరీక్షలతో ఆరోగ్య సమస్యలను గుర్తించడంతో పాటు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి స్పెషలిస్ట్ డాక్టర్లు, పీహెచ్‌సీ డాక్టర్లు, ఇతర వైద్య సిబ్బంది ద్వారా చికిత్సలు, మందులను ఉచితంగా అందించబోతోంది. ఎవరైనా రోగులకు అవసరమైతే ప్రభుత్వాస్పత్రులు, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేసి వైద్య చికిత్సలు చేయించనుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశాల మేరకు ఈనెల 15 నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ చర్యలు చేపట్టింది.

చెప్పింది చేయండి

▶ మొదటి పేజీ తరువాయి

నిర్వహిస్తోంది. ఇతరత్రా సేకరించిన వారి గుర్తింపు కార్డులతో వ్యవహారం నడుపుతోంది. వారి సంతకాలను ఫోర్జరీ చేస్తూ తీవ్ర నేరానికి పాల్పడుతోంది.

- ఘోస్ట్ చందాదారుల పేరిట చెక్‌లు జారీ చేస్తున్నప్పటికీ, ఆ చెక్కులను మార్గదర్శి చిట్ ఫండ్స్ యాజమాన్యం వారి వద్దే అట్టిపెట్టుకుంటోంది. ఆ చెక్కుల వివరాలను రికార్డుల్లో నమోదు చేయడం లేదు. బ్యాంకులో జమ చేయడం లేదు. ఇదో అతి పెద్ద ఆర్థిక మోసం. అలాంటి 3 వేల మంది ఘోస్ట్ చందాదారుల్లో వంద మందిని సీఐడీ విచారిస్తోంది.
- దాంతో బెంబేలెత్తిన మార్గదర్శి యాజమాన్యం ఆ ఘోస్ట్ చందాదారులకు ఫోన్లు చేసి బెదిరిస్తోంది. సీఐడీ దర్యాప్తునకు సహకరించవద్దని, తర్వాత తాము అన్నీ సెటిల్ చేస్తామని.. లేకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరిస్తోంది. మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్ తన పీఏ శశికళ ద్వారా చందాదారులకు ఫోన్లు చేసి బెదిరిస్తున్నారు.

అక్రమ డిపాజిట్లుగా నల్లధనం

- రిజర్వ్ బ్యాంక్ నిబంధనలకు విరుద్ధంగా మార్గదర్శి చిట్ ఫండ్స్ అక్రమ డిపాజిట్లు సేకరిస్తోంది. దీనిపై ప్రశ్నిస్తే తిరిగి బుకాయిస్తోంది. రాబోయే నెలలకు చిట్టీ గ్రూపులకు చెల్లించాల్సిన చందాలను అడ్వాన్స్‌గా జమ చేస్తున్నారని వక్రీకరించేందుకు ప్రయత్నిస్తోంది. కానీ అసలు చిట్టీ గ్రూపులు మొదలు కాకుండానే చందాదారుల పేరిట నాలుగైదు నెలల ముందే డిపాజిట్లు సేకరించిన విషయాన్ని సీఐడీ గుర్తించింది.
- చిట్టీ గ్రూపులు మొదలు కాకుండానే ఎవరైనా చందాల మొత్తం చెల్లిస్తారా? ఎవరూ చెల్లించరు కాబట్టి అవి అక్రమ డిపాజిట్లే. రాష్ట్రంలోని మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారులు దాదాపు 2 వేల మందిలో రూ.కోటికి పైగా విలువైన అక్రమ డిపాజిట్లు చేసిన, చిట్టీ గ్రూపుల్లో చందాదారులుగా ఉన్న వారు ఏకంగా 800 మందికిపైగా ఉన్నారు. చాలా కంపెనీల పేరిట భారీగా అక్రమ డిపాజిట్లు సేకరించారు.



- ఆ 800 మందికిపైగా డిపాజిట్‌దారులకు సీఐడీ నోటీసులు జారీ చేసింది. అంత భారీగా డిపాజిట్లు ఎలా చేశారు.. ఆ నిధులు ఏ ఆదాయ మార్గాల ద్వారా వచ్చాయనే కోణంలో విచారిస్తోంది. విజయవాడలో ఓ బిల్డర్ ఏకంగా రూ.50 కోట్ల విలువైన చిట్టీ గ్రూపుల్లో చందాదారునిగా ఉన్నారు.
- ఇలాంటి భారీ మొత్తాల డిపాజిట్‌దారులు, చిట్టీ గ్రూపుల్లో సభ్యుల గురించి ఆదాయ పన్ను శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులకు కూడా సీఐడీ సమాచారమిచ్చింది. అక్రమ డిపాజిట్ల ముసుగులో నల్లధనం చెలామణిలోకి తీసుకువస్తున్నారా అన్నది సీఐడీతోపాటు కేంద్ర దర్యాప్తు సంస్థలు పరిశీలించాల్సిన అవసరం ఉందని భావిస్తోంది.

రూ.9.43 కోట్ల జగజ్జనని చిట్ ఫండ్స్ ఆస్తులు అటాచ్

కేంద్ర చిట్ ఫండ్స్ చట్టాన్ని ఉల్లంఘిస్తూ అక్రమాలకు పాల్పడిన రాజమహేంద్రవరానికి చెందిన జగజ్జనని చిట్ ఫండ్స్‌కు చెందిన రూ.9,43,52,020 విలువైన స్థిరాస్తులను అటాచ్ చేయాలని సీఐడీ నిర్ణయించింది. వాటిలో భవనాలు, భూములు, ఖాళీ స్థలాలతో కూడిన మొత్తం 12 స్థిరాస్తులను అటాచ్ చేయనుంది. చందాదారుల ప్రయోజనాల పరిరక్షణ కోసం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సీఐడీ ప్రతిపాదనకు హోమ్ శాఖ ఆమోదిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై న్యాయస్థానం ఆమోదం కోసం సీఐడీ పిటిషన్ దాఖలు చేయనుంది. న్యాయస్థానం అనుమతి అనంతరం ఆ ఆస్తులను అటాచ్ చేస్తుంది.

ఏజెంట్లకూ కుచ్చుటోపీ

- మార్గదర్శి చిట్ ఫండ్స్ తమ చందాదారులు, ఏజెంట్లను కూడా మోసగిస్తోంది. కుట్ర పూరితంగా వారిని అప్పుల ఊబిలోకి నెట్టేస్తూ వారి ఆస్తులు రాయించుకుంటోంది. దీనిపై చందాదారులు, ఏజెంట్లు, ఘోస్ట్ చందాదారుల నుంచి భారీగా ఫిర్యాదులు వస్తున్నాయి. వాటిని పరిశీలించి తగిన ఆధారాలు ఉన్న వాటిపై సీఐడీ కేసులు నమోదు చేస్తోంది.
- విజయవాడలో కోళ్ల ఫారం యజమాని బొండు అన్నపూర్ణా దేవి అనే మహిళను ఏకంగా 65 చిట్టీ గ్రూపుల్లో చందాదారునిగా చేర్పించి ఆమెను అప్పుల ఊబిలోకి నెట్టేశారు. కుట్ర పూరితంగా విజయవాడలోని లబ్బీపేట, గుడివాడ మార్గదర్శి చిట్ ఫండ్స్ కార్యాలయాలు కేంద్రంగా ఈ మోసానికి పాల్పడ్డారు. విదేశాల్లో ఉన్న ఆమె కుమార్తె ప్రియాంక సంతకాన్ని కూడా ఫోర్జరీ చేశారు. ష్యూరిటీలు ఇచ్చినా సరే కొర్రీలు వేస్తూ ఆమెను డిఫాల్టర్‌గా చూపిస్తూ వారి ఆస్తులు కూడా రాయించుకున్నారు. దీనిపై ఆమె ఫిర్యాదు చేయడంతో మంగళగిరి సీఐడీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశాం. ఆమె రూ.14 కోట్ల విలువైన 65 చిట్టీ గ్రూపుల్లో చందాదారుగా ఉన్నారు. ఆమె రూ.8 కోట్లు చందా మొత్తం చెల్లించారు. కానీ చిట్టీ పాట పాడితే ఆమె చేతికి ఇచ్చింది కేవలం రూ.48 లక్షలు మాత్రమే. ఇందులో రూ.8 కోట్ల విలువైన 45 చిట్టీ గ్రూపుల్లో ఆమె రూ.1.7 కోట్లు చందా మొత్తంగా చెల్లిస్తే.. చిట్టీ పాట పాడిన తర్వాత ఆమె చేతికి ఇచ్చింది కేవలం రూ.8 వేలు. ఆమెను డిఫాల్టర్‌గా చూపిస్తూ వారి కుటుంబ ఆస్తులు కూడా రాయించుకుంటున్నారు.
- విశాఖపట్నం కంచరపాలెంకు చెందిన పిలక లలిత కుమారి ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగి. ఆమెను విశాఖపట్నంలోని డాబా గార్డెన్స్ మార్గదర్శి చిట్ ఫండ్స్ బ్రాంచి కార్యాలయంలో రూ.5 లక్షల చిట్టీ గ్రూపులో ఘోస్ట్ చందాదారుగా చేర్చారు. ఆ విషయం తెలిసి ఆమె చిట్ రిజిస్ట్రార్‌ను ఆశ్రయించారు. అక్కడ ఉన్న పత్రాల్లో ఉన్న సంతకాలు చూసి అవి తాను చేయలేదని ఫోర్జరీ చేశారని తెలిపారు.
- ఆమె చిట్టీ పాడినట్టు.. ఆమెకు చిట్టీ మొత్తం చెల్లించినట్టు కూడా రికార్డుల్లో ఉంది. అందుకు ఇద్దరు సాక్షి సంతకాలు కూడా చేశారు. తనకు తెలియకుండానే తనను చందాదారుగా చేర్చడంతోపాటు తన సంతకాలు ఫోర్జరీ చేయడంపై లలిత కుమారి విశాఖపట్నం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాంతో విశాఖపట్నం డాబా గార్డెన్స్ మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచి మేనేజర్ యలమంచిలి బాబూ రాజేంద్ర ప్రసాద్, మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఏజెంట్ కె.సంతోష్, సాక్షి సంతకాలు చేసిన జి.నరసింగరావుపై పోలీసులు కేసు నమోదు చేశారు. మార్గదర్శి చిట్ ఫండ్స్, ఎండీ శైలజా కిరణ్, ఆమె పీఏ శశికళ, విజయవాడ లబ్బీపేట బ్రాంచి మేనేజర్ బండారు శ్రీనివాసరావు, గుడివాడ బ్రాంచి మేనేజర్ వైవీవీడీ ప్రసాద్, పాతూరి రాజాజీ, పాపి నాయుడులను నిందితులుగా పేర్కొంటూ ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.
- పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో మార్గదర్శి చిట్ ఫండ్స్ ఏజెంట్‌నే ఆ సంస్థ మోసం చేసింది. ఏజెంట్ సంతకాన్ని బ్రాంచి మేనేజర్ ఫోర్జరీ చేశారు. ఏజంట్ ఫిర్యాదుపై సీఐడీ అధికారులు కేసు నమోదు చేశారు. వివరాలు త్వరలోనే వెల్లడించనున్నారు.

మా కుటుంబాన్ని దోచేసి రోడ్డున పడేశారు

- బోరున విలపించిన బొండు అన్నపూర్ణా దేవి

'మార్గదర్శి చిట్ ఫండ్స్ మమ్మల్ని పూర్తిగా మోసం చేసి ఆర్థికంగా కుదేలయ్యేట్టు చేసింది. మా కుటుంబాన్ని రోడ్డున పడేసింది. మా ఆస్తులు, బంగారం, వృద్ధాప్యంలో అవసరాల కోసం దాచుకున్న మొత్తం అంతా మార్గదర్శి చిట్ ఫండ్స్‌కు ధారపోశాం. అయినా సరే ఇంకా మమ్మల్ని వేధిస్తూ మిగిలిన ఉన్న ఇంటిని కూడా తీసుకునేందుకు వేధిస్తోంది. మా కుమార్తె సంతకాన్ని కూడా ఫోర్జరీ చేసి మోసానికి పాల్పడింది. నా భర్త ప్రభుత్వ వెటర్నరీ వైద్యుడు. నేను కోళ్ల ఫారం నిర్వహిస్తున్నాను. నేను మార్గదర్శి చిట్ ఫండ్స్‌లో ఒక గ్రూపులో చందాదారుగా చేరాను. ఆ తర్వాత ఏకంగా 65 గ్రూపుల్లో నన్ను చందాదారుగా చేర్చింది. నిబంధనల ప్రకారం మేము ఇచ్చిన ష్యూరిటీలను కూడా గుర్తించకుండా ఉద్దేశ పూర్వకంగా మమ్మల్ని 17 చిట్టీ గ్రూపుల్లో డిఫాల్టర్‌గా చూపించింది. మా ఆస్తు లు తీసుకుంది. నా భర్త జీపీఎఫ్ డబ్బులు కట్టి, పిల్లల పెళ్లి కోసం దాచుకున్న బంగారం కూడా అమ్మి చెల్లించాం. అయినా సరే ఇంకా బకాయి ఉన్నారంటూ మా ఇల్లు వేలం వేయించారు. మా ఇంటికి వచ్చి అల్లరి చేశారు. మా అమ్మాయి విదేశాల్లో వైద్య విద్య చదువుతోంది. ఆమె సంతకాన్ని కూడా ఫోర్జరీ చేసి చందాదారుగా చేర్చారు. ఆమె చిట్టీ పాట పాడినట్టు చూపించా రు. రూ.9 లక్షల నష్టానికి చిట్టీ పాట పాడినట్టు చూపించి బకాయిలు మినహాయించుకుని కేవలం రూ.210 మాత్రమే ఇస్తామని రికార్డుల్లో సర్దుబాటు చేశారు. ఆ చిట్టీ గ్రూపునకు సంబంధించి వాయిదాల బకాయిలు చెల్లించాలని మమ్మల్ని వేధిస్తున్నారు. అసలు ఈ దేశంలోనే లేని మా కుమార్తె ఎలా చందాదారుగా చేరింది? ఎలా వేలం పాటలో పాల్గొంది? తను వచ్చి ఎప్పుడు సంతకం చేసింది? ఇంత దారుణంగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ మమ్మల్ని మోసం చేసింది. మమ్మల్ని కుట్ర పూరితంగా అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేసిన మార్గదర్శి చిట్ ఫండ్స్ యాజమాన్యం, మేనేజర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నా.'

ఆలస్యంగా ఆశ్రయించడం సమర్థనీయం కాదు

నీట్ పరీక్ష రాసిన విద్యార్థిని తప్పుబట్టిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: వైద్యవిద్యలో 'స్థానిక'సీట్ల భర్తీకి సంబంధించి ఇప్పటికే దాఖలైన పలు పిటిషన్లపై తీర్పును రిజర్వు చేశామని, ఇప్పుడు మరో పిటిషన్‌పై విచారణ చేపట్టలేమని హైకోర్టు తేల్చిచెప్పింది. ఇంత ఆలస్యంగా కోర్టును ఆశ్రయించడాన్ని సమర్థించలేమని స్పష్టం చేసింది. వైద్యవిద్య సీట్ల భర్తీ అనేది కాలపరిమితితో కూడిందని, ఇప్పటికే రెండుసార్లు కౌన్సెలింగ్ కూడా ముగిసిందని చెప్పింది. ఆగస్టు 2వ తేదీనే నాన్ లోకల్‌గా పేర్కొన్నా 31వ తేదీ వరకు పిటిషనర్ ఎలాంటి చర్యలు చేపట్టకపోవడాన్ని తప్పుబట్టింది. పిటిషన్‌ను కొట్టివేసింది. ఇంటర్మీడియట్ స్థానికంగా చదవకుంటే నీట్‌లో లోకల్ కోటా (85 శాతం) కిందికి రారంటూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 114ను సవాల్ చేస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం కొత్తపల్లెకు చెందిన విద్యార్థి శ్రీస్వరాజ్ రవీందర్ నాగపూర్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. లోకల్‌గా పరిగణించకుంటే కేవలం 15 శాతం సీట్లలోనే తాము పోటీపడాల్సి ఉంటుందని, ఇది చట్టవిరుద్ధమ ని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై ప్రధానన్యాయ మూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం న్యాయసూత్రాల మేరకు కొన్నిసార్లు ఆలస్యం అనేది న్యాయాన్ని పొందకుండా చేస్తుందని వ్యాఖ్యానించింది. ఇలాంటివారి హక్కుల పరిరక్షణకు ఎలాంటి ఉపశమన ఆదేశాలు ఇవ్వలేమంటూ పిటిషన్‌ను కొట్టివేసింది.

12న వడ్డెర ప్రతినిధుల మహాసభ

పంజగుట్ట: తెలంగాణ రాష్ట్రం వస్తే వడ్డెర కులస్తులకు న్యాయం జరుగుతుందనే ఆశాభావంతో ఉద్యమంలో ముందుండి పోరాడితే ఉమ్మడి ఏపీలో ఉన్న హక్కులు కూడా ప్రత్యేక రాష్ట్రంలో లేకుండా చేస్తూ అధఃపాతాళానికి తొక్కేస్తున్నారని తెలంగాణ రాష్ట్ర వడ్డెర సంఘం ఆవేదన వ్యక్తం చేసింది. వడ్డెరల సమస్యలు చర్చించేందుకు ఈ నెల 12న బాగ్‌లింగంపల్లి సుందరయ్య కళానిలయంలో వడ్డెర సంఘం ప్రతినిధుల మహాసభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మహాసభ పోస్టర్‌ను గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వ్యవస్థాపక అధ్యక్షుడు పల్లపు సమ్మయ్య, అధ్యక్షుడు ద్యారంగుల నగేశ్, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు శివరాత్రి దుర్గయ్య ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 20 లక్షల జనాభా ఉన్న వడ్డెర కులస్తులకు బీఆర్ఎస్ పార్టీ ఒక్క సీటు కూడా కేటాయించలేదన్నారు. ఇప్పటికైనా అన్ని పార్టీలు కనీసం 4 సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. వడ్డెర పిల్లలకు గురుకులాల్లో ఎంట్రెన్స్ లేకుండా సీట్లు ఇవ్వాలన్నారు. మహాసభకు హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో నాయకులు ఐలయ్య, పి.నవీన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వార్తలు

పెద్దమ్మతల్లి గుడి షాపులకు 13న వేలం

పాల్వంచరూరల్: మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయం సమీపాన నిర్మించిన కాంప్లెక్స్‌లో షాపులు కేటాయించేందుకు ఈనెల 13న వేలం నిర్వహిస్తున్నట్లు ఈఓ రజనీకుమారి తెలిపారు. కాంప్లెక్స్‌లోని 11షాపులను మూడేళ్లపాటు అద్దెకు ఇవ్వనుండగా, కొబ్బరి చిప్పలు, భక్తులు అమ్మవారికి సమర్పించిన చీరలను ఏడాదిపాటు పోగు చేసుకునే హక్కు కల్పించేందుకు వేలం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న వారు 13న బుధవారం ఉదయం వరకు రూ.200 చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

సీహెచ్‌పీల్లో సింగరేణి డైరెక్టర్ తనిఖీ

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలోని రుద్రంపూర్, జేవీఆర్ ఓసీల్లో కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ల(సీహెచ్‌పీ)ను సింగరేణి డైరెక్టర్ సత్యనారాయణరావు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీహెచ్‌పీల్లో బొగ్గు రవాణా విషయాలపై ఆరాతీశారు. అనంతరం కొత్తగూడెం జీఎం కార్యాలయంలో అధికారులతో సమీ క్షించారు. బొగ్గు నాణ్యత ఏ మాత్రం తగ్గకుండా రక్షణతో కూడిన ఉత్పత్తి చేయాలని, ఎక్కడ కూడా ఉత్పత్తి, రవాణాకు అంతరాయం ఏర్పడకుండా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో అధికారులు నవీన్‌కుమార్, వై.రఘురామి రెడ్డి, కే.వీ.రావు, ఎం.కమలాకర్, దుర్గాప్రసాద్, విశ్వేశ్వరరావు, సోమశేఖర్, రమణారెడ్డి పాల్గొన్నారు.

నేడు అడ్తిదారులకు లైసెన్సులు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో నూతనంగా గుర్తించిన అడ్తిదారులకు శుక్రవారం లైసెన్సులు అందించనున్నారు. మార్కెట్‌లో సాయంత్రం 4 గంటలకు జరిగే సమావేశంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వారికి లైసెన్సులు అందించనున్నారని మార్కెట్ చైర్‌పర్సన్ దోరెపల్లి శ్వేత తెలిపారు. కాగా, మొత్తం 420 మంది దరఖాస్తు చేసుకోగా, 150 మందికి లైసెన్సులు ఇవ్వాలని నిర్ణయించారు.

కేంద్రంలో మళ్లీ మోడీ ప్రభంజనమే

- తెలంగాణలోనూ అధికారంలోకి వస్తున్నాం..
- మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి

కల్లూరురూరల్/ఖమ్మం మామిళ్లగూడెం: త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ హ్యాట్రిక్ విజయం సాధించి, మోదీ ప్రధానమంత్రి కావడం ఖాయమని బీజేపీ తమిళనాడు సహ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి వెల్లడించారు. కల్లూరు మండలంలోని నారాయణపురంలో గురువారం మేరీ మిట్టీ.. మేరా దేశ్ కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నారాయణపురంతో పాటు ఖమ్మంలోని బీజేపీ జిల్లా కార్యాలయాల్లో సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలోనే కాక తెలంగాణలో కూడా బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణను అప్పుల ఊబిలోకి నెట్టిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని ఎద్దేవా చేశారు. కాగా, జాతీయ సమైక్యత, సమగ్రతలను దృష్టిలో పెట్టుకుని నిర్వహిస్తున్న మేరీ మిట్టి, మేరా దేశ్ కార్యక్రమం ద్వారా పవిత్ర ప్రాంతాలు, ఇతర చోట్ల నుంచి సేకరిస్తున్న మట్టిని 7,500 కలశాలల్లో ఢిల్లీకి తరలిస్తున్నట్లు తెలిపారు. ఇక ఈనెల 17న సేవా పక్వాడా పేరుతో 18 కులవృత్తుల వారికి సాయం అందించనున్నట్లు సుధాకర్‌రెడ్డి వెల్లడించారు.



నారాయణపురంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న బీజేపీ నాయకుడు సుధాకర్‌రెడ్డి, తదితరులు

రెడ్డిపల్లిలో పర్యటన

ఖమ్మంరూరల్: ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లిలో పొంగులేటి సుధాకర్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య ఇంట్లో మట్టి సేకరించి మారెమ్మతల్లి ఆలయంలో పూజలు చేయించారు. ఈసమావేశాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరావుతో పాటు నాయకులు నకిరికంటి వీరభద్రం, పుల్లయ్య, మంద సరస్వతి, అల్లిక అంజయ్య, సుగుణ, నెల్లూరి కోటేశ్వరావు, యాకూబ్‌పాషా, దీకొండ శ్యాం, శివాజీ, పొంగులేటి మహేందర్‌రెడ్డి, గుమ్మా రామకృష్ణ, గుండపనేని అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మోడీ, కేసీఆర్ విధానాలపై పోరాడతాం

ఖమ్మంమయూరిసెంటర్: నూతన ఆర్థిక విధానాలు ఫలితంగానే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నన నేపథ్యాన... ప్రధాని మోదీ, సీఎం కేసీఆర్ ఆర్థిక విధానాలపై పోరాటాలు చేస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ తెలిపారు. ఖమ్మంలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ పాలనలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయని ఆరోపించారు. మరోసారి బీజేపీ ప్రభుత్వం వస్తే మతాల మధ్య చిచ్చుపెట్టి అల్లకల్లోలం సృష్టించడం ఖాయమని తెలిపారు. హిందుత్వం పేరిట మత రాజకీయాలు చేస్తూ హిందువులపై ఆర్థిక భారం మోపడం ఏమిటని ప్రశ్నించారు. ఇక తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కూరగాయల ధరలు, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు యర్రా శ్రీకాంత్, వై.విక్రమ్, భుక్యా శ్రీనివాసరావు, యర్రా గోపి, బండారు యాకయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలోమాట్లాడుతున్న సుదర్శన్

దడ పుట్టిస్తున్న డెంగీ కేసులు

రఘునాథపాలెం: జిల్లాలోని మంచుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో కొద్దిరోజులుగా డెంగీ కేసులు నమోదవుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వారం రోజులుగా వర్షాలు పడుతుండటంతో గ్రామాల్లోని నీటి నిల్వల్లో దోమల పెరిగి డెంగీ కేసులు నమోదవుతున్నట్లు తెలుస్తోంది. ఈ పీహెచ్‌సీ పరిధిలో బుధవారం ఇద్దరు డెంగీ బారిన పడకుండగా గురువారం పువ్వాడనగర్‌లో ఒకరికి డెంగీ నిర్ధారణ అయినట్లు తెలిసింది. దీంతో వైద్యులు సదరు వ్యక్తిని ఆస్పత్రికి తరలించడంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల వారికి పరీక్షలు చేశారు. ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ సంధ్యారాణి పాల్గొన్నారు.

సింగరేణి గనులను సందర్శించిన ఢిల్లీ బృందం

సత్తుపల్లిరూరల్/మణుగూరు రూరల్: సత్తుపల్లి మండలం జేవీఆర్ ఓసీతో పాటు మణుగూరు సింగరేణి ఏరియాను న్యూఢిల్లీకి చెందిన ఐఆర్‌టీఎస్ ప్రిన్సిపల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేష్ పాఠక్ గురువారం సందర్శించారు. చీఫ్ కమర్షియల్ మేనేజర్ (ప్యాసింజర్ సర్వీసెస్) సుదర్శన్‌రెడ్డి, సింగరేణి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(కోల్ మేనేజ్‌మెంట్) డాక్టర్ జె.ఆల్విన్‌తో కలిసి వచ్చిన ఆయన బంకర్ల ద్వారా రోజువారీగా బొగ్గు రవాణా వివరాలు తెలుసుకున్నారు. అనంతరం బొగ్గు రవాణా, నిల్వ, బెల్ట్‌ల నిర్వహణను పరిశీలించారు. ఇక మణుగూరులో బీటీపీఎస్‌కు బొగ్గు రవాణా కోసం రైల్వే ట్రాక్ పురోగతిపై చర్చించారు. కాగా, ఢిల్లీ బృందాన్ని సింగరేణి కొత్తగూడెం, మణుగూరు ఏరియాల జీఎంలు షాలేం రాజు, దుర్గం రాంచందర్ సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో రైల్వే, సింగరేణి అధికారులు సురేందర్, నర్సింహారావు, సుందర్‌రాజు, మోషక్, ప్రదీప్‌కుమార్, రవి, సురేష్, మదన్ నాయక్, డి.శ్రీనివాస్, నిరంజన్, జె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఓసీలోని సైలో బంకర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

వర్షంతో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

సత్తుపల్లిరూరల్: ఖమ్మం జిల్లావ్యాప్తంగా బుధవారం సాయంత్రం, గురువారం ఉదయం కురిసిన వర్షంతో సత్తుపల్లి జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీల్లో బొగ్గు ఉత్పత్తి, ఓబీ పనులకు అంతరాయం ఏర్పడింది. రెండు ఓసీల్లో 1.90లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ తొలగింపు, 36వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయిందని పీఓలు ఎస్.వెంకటాచారి, నర్సింహారావు తెలిపారు.

ఎన్నికల నేపథ్యంలో పటిష్ట నిఘా



సమావేశంలో పాల్గొన్న తెలంగాణ, ఏపీ పోలీసు అధికారులు

సన్నాహక సమావేశంలో అంతర్ రాష్ట్ర పోలీసుల నిర్ణయం

పెనుబల్లి/అశ్వారావుపేటరూరల్: త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యాన నిఘా పటిష్టం చేసేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యాన గురువారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈమేరకు ఏపీ, తెలంగాణలోని పోలీస్ అధికారులు పెనుబల్లి, అశ్వారావుపేటలో సమావేశం కాగా, కల్లూరు ఏసీపీ బి.రామానుజం, పాల్వంచ డీఎస్పీ ఎస్.వెంకటేష్ మాట్లాడారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అశ్వారావుపేట నియోజకవర్గానికి సరిహద్దుగా ఉన్న ఏపీలోని పోలీసు అధికారులతో సమన్వయం చేసుకుంటున్నట్లు తెలిపారు. నిఘాను పటిష్టం చేయడం, చెక్ పోస్టుల ఏర్పాటు, బందోబస్తుతోపాటు ఇతర అంశాలపై ఉమ్మడిగా చర్చించినట్లు చెప్పారు. ప్రశాంతంగా ఎన్నికలు పూర్తయ్యేలా భద్రతాపరంగా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ సమావేశంలో ఏపీలోని ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం, నూజివీడు డీఎస్పీలు ఎం.ధనుంజయ్, అశోక్‌కుమార్, నూజివీడు రూరల్, చింతలపూడి, జీలుగుమిల్లి, భద్రాద్రి జిల్లా పాల్వంచ, అశ్వారావుపేట, సత్తుపల్లి, కల్లూరు సీఐలు ఆర్.అంకబాబు, ఎం.మల్లేశ్వరరావు, బి.వెంకటేశ్వరరావు, వి.వినయ్‌కుమార్, టి.కరుణాకర్, జె.మోహన్‌బాబు, సీహెచ్.హనోక్, అశ్వారావుపేట ఎక్సైజ్ సీఐ కె.నాగయ్య, ఎస్సైలు జి.సూరజ్, పి.శ్రీకాంత్, శివరామకృష్ణ, సాయికిషోర్‌రెడ్డి, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్య చరిత్రలో శాశ్వత సంతకం 'మువ్వా'

ఖమ్మంగాంధీచౌక్: తెలుగు సాహిత్య చరిత్రలో మువ్వా శ్రీనివాసరావు తన కవితలు, రచనలతో శాశ్వత సంతకం చేశారని సాహితీవేత్త టీ.వీ.పూర్ణచందర్‌రావు వెల్లడించారు. ఖమ్మం జెడ్పీ సమావేశ మందిరంలో శ్రీనివాసరావు సాహిత్యంపై వెలువడిన 'అనితరుడు' వ్యాససంకలన పరిచయ సభ గురువారం ఏర్పాటుచేశారు. ఈ సభలో ముఖ్యఅతిథిగా పూర్ణచందర్‌రావు మాట్లాడుతూ శ్రీనివాసరావు తనకు ఆత్మీయ శిష్యుడని, తాను ప్రారంభించిన 'దీపిక' పాఠశాల పత్రికలో మొదటి కవిత రాశాడని గుర్తు చేశారు. అనంతరం విద్యావేత్తలు రవిమారుత్, ఐ.వీ.రమణారావు మాట్లాడగా కీర్తి పురస్కార గ్రహీత, కథకుడు రాచమళ్ల ఉపేందర్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అట్లూరి వెంకటరమణ, కన్నెగంటి వెంకటయ్య, పొత్తూరి సీతారామారావు, పగిడిపల్లి వెంకటేశ్వర్లు, ఉరిమళ్ల సునంద, నామా పురుషోత్తం, బుక్కా సత్యనారాయణ, రమేష్, సుభాషిణి, హవీల, జనార్దన్, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.



సభలో పాల్గొన్న పూర్ణచందర్‌రావు, తదితరులు

గంజాయి మత్తులో బాలుడిపై దాడి

ఖమ్మంక్రైం: ఖమ్మం ముస్తఫానగర్‌లో గంజాయి మత్తులో ఆకతాయిల ఆగడాలకు అడ్డు లేకుండా పోయింది. దారి వెంట వెళ్తున్న ఓ బాలుడిపై దాడి చేసిన ఘటన చోటు చేసుకుంది. ఓ ప్రైవేట్ స్కూల్‌లో చదువుతున్న 9వ తరగతి విద్యార్థి స్నేహితులతో గురువారం ఆరుబయట ఆడుకుంటున్నాడు. ఆ ప్రాంతంలో గంజాయి తాగుతున్న పలువురు సదరు బాలుడిని పట్టుకుని అకారణంగా చితకబాదారు. దీంతో బాలుడి స్నేహితులు వెళ్లి ఆయన తండ్రికి చెప్పగా వచ్చి అడ్డుకోబోయిన ఆయనపై కూడా దాడి చేశారు. గతంలోనూ ఇలాంటి ఘటనలు జరిగినందున పోలీసులు స్పందించి ఆకతాయిలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.